సాక్షి
నిర్మల్

శుక్రవారం | 26 | జూలై | 2024



పెచ్చులూడిన పాఠశాల పైకప్పు
లక్ష్మణచాంద మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పైకప్పు గురువారం పెచ్చులూడిపడింది. విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. IIలో▸



ముసురుతో కలుపు
వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేలల్లో కలుపు విపరీతంగా పెరుగుతోంది. రైతులు ఆందోళన చెందుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
28.8 /24.4

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

నిర్మల్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాల్లో గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటూ.. ప్రమాదాలను నివారించాలని సూచించారు. రోడ్డు సూచనలు, సిగ్నల్స్‌ను పాటించాలన్నారు. డ్రైవర్లు ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రమాద రహిత వారోత్సవాలు ఈనెల 30 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఆర్టీసీ మెకానిక్‌లు మంచి కండిషన్‌తో డ్రైవర్లకు బస్సులు అప్పగించాలని సూచించారు. వర్షాకాలం తగు సూచనలు తీసుకుని బస్సులు నడపాలని చెప్పారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఇంజినీర్ నవీన్‌కుమార్, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

సోన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 26న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఆర్.ప్రశాంతి తెలిపారు. లెఫ్ట్ పోచంపాడ్, జామ్, కడెం, భైంసా కళాశాలల్లో బాలికలకు, ముధోల్ కళాశాలలో ప్రవేశాలకు బాలురకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. 2024లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు దిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల (సీవోఈ)లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. బాలురకు 27న బిక్కనూర్ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

తైక్వాండోపై ఆసక్తి చూపాలి

నిర్మల్ టౌన్: తైక్వాండో క్రీడపై విద్యార్థులు ఆసక్తి చూపాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాయత్ సోమేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్కే కన్వెన్షన్ హాల్‌లో గురువారం మాట్లాడారు. రెండేళ్లుగా అసోసియేషన్ ఎలాంటి నియమ నిబంధనలతో కొనసాగిందో అదే విధంగా క్రమశిక్షణ అంకితభావంతో ఈ నూతన కార్యవర్గం ఆర్గనైజ్ చేయబడుతుందన్నారు. నిర్మల్ జిల్లాలో తైక్వాండోపై ఆసక్తి ఉన్న ప్రతీ విద్యార్థికి నేర్పించి, రాష్ట్రంలో జిల్లా పేరుని ఉన్నత స్థాయిలో నిలుపుతామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాలో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల భూషణ్, సెక్రెటరీ సురేశ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కిషన్, వంశీ, కోశాధికారి దాయాత్ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

భైంసాటౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తోందని, ఫలితంగా సంఘం సభ్యత్వానికి ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన వస్తోందని జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న అన్నారు. పట్టణంతోపాటు పలు మండలాల్లో గురువారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పండిత, పీఈటీల సమస్యను కొలిక్కి తెచ్చి పదోన్నతులు కల్పించామని తెలిపారు. త్వరలోనే 317 జీవో బాధితులకు న్యాయం చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. పదోన్నతులతో ఏర్పడిన ఖాళీల భర్తీకి సీఎంతో చర్చించి సాధిస్తామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర నాయకులు పెద్దకాపు సత్యనారాయణ, కుబీర్, లోకేశ్వరం ఎంఈవో చంద్రకాంత్, జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీటీడీవోను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగులు



డీటీడీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఖానాపూర్: జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజి నాయక్‌ను నాలుగో తరగతి ఉద్యోగులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో డీటీడీవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజలింగు, కోల వసంత్, అశోక్, రవీందర్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

వ్యవసాయ బడ్జెట్



- సాగుకు భారీగా కేటాయింపులు
- వరికి రూ.500బోనస్
- గృహజ్యోతి, రూ.500 గ్యాస్‌సిలిండర్‌కు నిధులు
- మహాలక్ష్మి, నిరుద్యోగభృతి జాడలేదు
- మిశ్రమంగా రాష్ట్ర ప్రభుత్వ పద్దు

నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రైతన్న దిశగా సాగింది. సాగుకు సాయంగా భారీ కేటాయింపులు చేసింది. దీంతో వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న నిర్మల్‌కూ లబ్ధి చేకూరనుంది. సాగుతోపాటు గృహజ్యోతి, రూ.500కే సిలిండర్‌పై దృష్టిపెట్టింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లోని మహిళలకు రూ.2,500 ఆర్థికసాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం జిల్లా వాసులను నిరాశపర్చింది. మొత్తం మీద ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్రబడ్జెట్ సైతం ఆశనిరాశల పద్దుగానే సాగిందని జిల్లావాసులు పేర్కొంటున్నారు. జిల్లాకు కేటాయింపులు లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

సాగు బాగు కోసం..
రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో వ్యవసాయానికే పెద్దపీట వేసింది. భారీ కేటాయింపులతో రైతులను ఆకట్టుకుంది. వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చేందుకు నిర్ణయించింది. జిల్లాలో 1.50 లక్షలకుపైగా ఉన్న రైతులు ఉండగా ఎక్కువ మంది వరి రైతులే. వీరందరికీ లబ్ధి కలుగనుంది. ఇటీవల కేంద్రం సైతం ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహిస్తామని ప్రకటించింది. సాగుకు సహకరించే ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పెద్దగా కేటాయింపులు లేవు. చివరిదశలో ఉన్న సదర్మాట్, పలు ఎత్తిపోతలకు మాత్రమే ఇటీవల కేటాయింపులు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద గత ప్రభుత్వం చేపట్టిన ప్యాకేజీ 27, 28 పనులపై స్పష్టత లేదు. ఇక రైతుకూలీలకు త్వరలో రూ.12 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించడంతో జిల్లాలోని రైతు కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీటి ప్రస్తావనే లేదు..
ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు భృతిగా ఇస్తామన్న రూ.4 వేలు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2,500 సాయం గురించి రేవంత్ సర్కారు మర్చిపోయిందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. కొత్త పింఛన్లతోపాటు పాత పింఛన్ల పెంపుపైనా స్పష్టతనివ్వలేదని విమర్శిస్తున్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాం నుంచే వందలాదిమంది పింఛన్లు రాక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త ప్రభుత్వమూ వారికి మొండిచేయి చూపుతోందని బీజేపీ ఆరోపిస్తోంది.

కరెంటు.. సిలిండర్..
ఎన్నికల హామీల్లో భాగంగా రూ.500కే సిలిండర్ ఇచ్చే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులను ప్రకటించారు. దీంతో జిల్లాలో రేషన్ కార్డు ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తామన్న విద్యుత్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. దీంతో రేషన్‌కార్డు ఉన్నవారి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగనుంది. ఇక రాష్ట్రాన్ని కుదిపేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు బడ్జెట్‌లో హోం శాఖకు భారీగా నిధులు ఇచ్చింది. జిల్లాలోనూ గంజాయి బానిసల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే పోలీసులు పలు కేసులు చేపట్టారు. ఇప్పుడు మరింత పక్కాగా దృష్టిపెట్టనున్నారు.

సంక్షేమ బడ్జెట్..



తమది రైతుసంక్షేమ ప్రభుత్వమని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా చాటుకుంది. రైతన్న సంక్షేమానికి పెద్దపీట వేసింది. అలాగే అన్నివర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించింది. బడ్జెట్ ద్వారా నిర్మల్ జిల్లాకూ మేలు జరగనుంది.
– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

మహిళలు, యువతకు మొండిచేయి..



రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలు, యువతకు మొండిచేయి చూపారు. ప్రజాసంక్షేమ పథకాలకు అరకొరగా కేటాయింపులు ఉన్నాయి. అప్పులే తప్ప.. ఆదాయం ఎలా సమకూర్చుకుంటారో చూపలేదు. రాజకీయ ఉపన్యాసంలాగే రాష్ట్ర బడ్జెట్ ప్రసంగం సాగింది.
– రావుల రాంనాథ్, బీజేపీ సీనియర్‌నేత

ఉద్యమకారుల ఊసేలేదు..



రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులను విస్మరించడం బాధాకరం. దశాబ్దకాలంగా నిరాదరణకు గురైన ఉద్యమకారులను గుర్తిస్తామని చెప్పడంతో ప్రభుత్వంపై ఆశలు రేకెత్తాయి. కానీ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో నిరాశపర్చింది.
– కొట్టెశేఖర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

టెండర్ ప్రకటన రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వివిధ శాఖలకు అవుట్ సోర్సింగ్ సర్వీస్ అందించేదుకు గత నెలలో రిజిస్టర్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల నుంచి స్వీకరించిన టెండర్లు రద్దు చేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.శంకర్ తెలిపారు. ఇదివరకే పాల్గొన్నవారు తిరిగి కొత్త టెండర్ నోటిఫికేషన్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, నిర్మల్ జిల్లా వారు ఇచ్చిన టెండర్ పామ్ తీసుకుని డాక్యుమెంట్స్ తప్పనిసరిగా పొందు పర్చాలని సూచించారు. ఇదివరకే ఇచ్చిన డీడీలు పరిగణలోనికి తీసుకుంటామని పేర్కొన్నారు.

వాహనాల వేలం

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎండీ.రజాక్ సమక్షంలో గురువారం వేలం నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు-18, బొలెరో -01, కార్లు-04, ఆటోలు-03, ట్రాలీ ఆటో -01, మొత్తం 26 వాహనాలు వేలం వేశారు. వాహనాలను దక్కించుకునేందుకు 89 మంది వేలంలో పాల్గొన్నారు. శాఖ అధికారులు రూ.1,63,950 నిర్ధారించగా, రూ.8,76,278 పలికినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రభుత్వ స్థలాల రక్షణ, వివిధ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై గురువారం సమీక్ష నిర్వహించారు. ధరణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెషన్స్, కోర్టు కేసులు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ధరణి దరఖాస్తుల పరిష్కారం, మండలాల వారీగా వివిధ దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురికాకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు చెరువు భూములను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన దష్ట్యా విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీం, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకీషర్మిల



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

సారంగపూర్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును డీఈ శ్రీనివాస్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నదీ పరీవాహక ప్రాంతాలకు రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు వెళ్లొద్దని సూచించారు. వీరివెంట ఎస్సై శ్రీకాంత్, జేఈ దేవేందర్, మధుపాల్, నీటిపారుదల శాఖ సిబ్బంది ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత
నిర్మల్ టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు పోగొట్టుకున్న 41 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్సైట్ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకోగా వాటిని ఎస్పీ జానకీషర్మిల పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధితులకు అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఫోన్‌లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సీఈఐఆర్) అనే అప్లికేషన్ పోయిన ఫోన్‌ను పట్టుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటి వరకు పోయిన 809 ఫోన్లు రికవరీ చేశామనానరు. డీఎస్పీ గంగారెడ్డి, ఆర్ఎస్ఐ రవి, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, టైఫాయిడ్, మలేరియా వ్యాప్తి చెందకుండా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, దోమ నివారణ మందు పిచికారీ చేయాలని తెలిపారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ప్రతీరోజు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సర్వే నిర్వహించి, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేయాలన్నారు. రెండో విడత ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లో ఫీవర్ సర్వేలను, ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. రోడ్లు బాగాలేని గ్రామాల్లో నెలలు నిండిన గర్భిణులను గుర్తించి బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు తరలించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ఖాళీ చేయించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ధనరాజ్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్, అధికారులు పాల్గొన్నారు.

‘సిరాల’ గండికి ఏడాది

- రెండు రోజులు గుట్టపైనే గ్రామస్తుల జాగరణ
- నాటి భయానక పరిస్థితి గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- ఏడాదైనా ప్రాజెక్టు పునరుద్ధరణ చేయని అధికారులు
- భారీ వర్షాలు కురిస్తే మళ్లీ ఇబ్బందే అంటున్న రైతులు



సిరాల ప్రాజెక్టుకు పడిన గండి ఇదే..

భైంసారూరల్: జూలై 24.. ఈ తేదీ తలుచుకుంటేనే.. జిల్లా వాసుల వెన్నులో వణుకు పుడుతుంది. 2023లో జూలై 20 నుంచి భారీ వర్షాలు కురవడంతో కడెం ప్రాజెక్టు గేట్లపైనుంచి వరద నీరు పారింది. గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టులకు కూడా భారీగా వరద రావడంతో గేట్లు ఎత్తారు. దీంతో నిర్మల్, భైంసా పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇదే సమయంలో భైంసా మండలంలోని సిరాల గ్రామంలోని పురాతన సిరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తడంతో జూలై 24న ప్రాజెక్టు కట్టకు గండిపడింది. నీరంతా కింద ఉన్న పంట భూములను ముంచెత్తింది. ప్రాజెక్టు తెగిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు మూట ముల్లె సర్దుకుని సమీపంలోని గుట్టపైకి వెళ్లారు. వరద తగ్గే వరకూ రెండు రోజులు అక్కడే మహాదేవుని ఆలయంలో తలదాచుకున్నారు. తాగేందుకు నీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. గుట్టపై నుంచి చూస్తే ఊరు చుట్టూ నీళ్లే కనిపించాయి. ఇక వరద తగ్గాక వచ్చి చూస్తే పంటల ఆనవాళ్లే కనిపించలేదు. వరద ధాటికి భూముల హద్దులు చెరిగిపోయాయి.

1902లో నిర్మాణం..
సిరాల ప్రాజెక్టును 1902లో నిజాం కాలంలో నిర్మించారు. ప్రాజెక్టు కట్ట పక్కనే గ్రామస్తులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. గతేడాది వచ్చిన వరదలకు ప్రాజెక్టు తెగడంతో ఇప్పటికీ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రాజెక్టు తెగడంతోనే కట్టపై నుంచి ఉన్న రోడ్డు తెగిపోయింది. గ్రామస్తులకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న రోడ్డు కూడా దెబ్బతింది. అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేక నిధులు ఇచ్చి ఉమ్రి వైపు మొరం పోయించారు. బోసివైపు వెళ్లే రోడ్డు మూసుకుపోవడంతో గుట్టకు మరోవైపు ఉన్న ఉమ్రి వైపు రోడ్డును తాత్కాలికంగా వేయించారు. వర్షాకాలం ముగిసే వరకు సిరాలవాసులంతా ఉమ్రివైపు ఉన్న మట్టి రోడ్డు నుంచే రాకపోకలు కొనసాగించారు.

శ్రమదానంతో మరమ్మతు..
ఇక గత వేసవిలో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు గ్రామస్తులే శ్రమదానంతో కొట్టుకుపోయిన రోడ్డును తాత్కాలికంగా బాగుచేసుకున్నారు. వ్యవసాయ భూములన్నీ మాంజ్రి, బోసివైపే అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తాత్కాలికంగా వేసిన రోడ్డు బురదగామారింది. భారీ వర్షాలు కురిస్తే ఈ రోడ్డుపై నుంచి రాకపోకలు కొనసాగించే పరిస్థితి ఉండదు.

ఏడాదైనా గండి పూడ్చని వైనం..
ప్రాజెక్టు తెగి ఏడాది గడిచినా అధికారులు గండి పూడ్చలేదు. మరమ్మతులు చేపట్టలేదు. అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వం ప్రాజెక్టు పునరుద్ధరణకు రూ.9 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు కూడా పూర్తయ్యాయి. అయితే ఇప్పటికీ పనులు చేపట్టలేదు. ఇక ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సిరాల వాసులు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో వరదనీరంతా ఇదే ప్రాజెక్టులోకి చేరుతుంది. భారీ వర్షాలు కురిస్తే వరద అంతగా గండి గుండా సిరాల గ్రామంలోకి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వరద గ్రామంలోకి రాకుండా చూడాలని కోరుతున్నారు.

మూడువైపులా మార్గం లేక...
భారీ వర్షాలు కురిసి వరద వస్తే నీరు సిరాలను ముంచెత్తుతుంది. సిరాల గ్రామం నుంచి వెళ్లే మూడు మార్గాలు మూసుకుపోయే అవకాశం ఉంది. గ్రామస్తులకు ఉన్న ప్రధాన రోడ్డు కిలోమీటరు మేర గతేడాది తెగిపోయింది. ఇప్పటికీ దానికి మరమ్మతు చేయలేదు. మరోవైపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇలేగాం వెళ్లేందుకు ఉన్న రోడ్డు పూర్తిగా కనుమరుగైంది. ప్రాజెక్టు ప్రధాన కాలువను ఆనుకుని మూడు కిలోమీటర్ల మేర రోడ్డు ఉండేది. ప్రాజెక్టు నీటి ఉధృతికి కాలువతోపాటు రోడ్డు కొట్టుకుపోయింది. పక్కనే ఉన్న రోడ్డుపై బండరాళ్లు, ఇసుకమేటలు కనిపిస్తున్నాయి. ఉమ్రివైపు వెళ్లే రోడ్డును తాత్కాలికంగా పునరుద్ధరించినా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అది కూడా బురదగా మారింది.

భయం భయంగా..



భారీ వర్షం కురిస్తే నీరంతా మళ్లీ ఊరు చుట్టుచేరుతుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అందరం భయం భయంగా జీవనం సా గిస్తున్నాం. మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో వరద ఎప్పుడు గ్రామాన్ని చుట్టుముడుతుందో అని రాత్రి పూట జాగారం చేస్తున్నాం. వరద గ్రామంలోకి రాకుండా మళ్లించాలి.
– శివ, గ్రామస్తుడు

రాకపోకలకు కష్టమే..



ఈ వర్షాకాలంలో ఊరి నుంచి రాకపోకలకు కష్టాలు మొదలయ్యాయి. మూడువైపులా రోడ్లు ఉన్నా ఇబ్బందులు పడుతున్నాం. బోసివైపు నుంచి వచ్చే బీటీ రోడ్డు కిలోమీటరు మేర కోతకుగురైంది. ఇలేగాం వెళ్లే రోడ్డుపై ఇసుక, బండరాళ్ల మేట వేశాయి. ఉమ్రివైపు ఉన్న రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారింది. గ్రామానికి వచ్చే రోడ్లు పునర్నిర్మించాలి.
– రహీమద్, గ్రామస్తుడు

నిధులు మంజూరయ్యాయి



సిరాల ప్రాజెక్టు పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఎగువన ఉన్న చెరువులు తెగి ఆ నీరంతా సిరాల ప్రాజెక్టులోకి చేరింది. ఒకేసారి భారీగా వరద రావడంతో ప్రాజెక్టు కట్ట తెగింది. వచ్చే వానాకాలం నాటికి ప్రాజెక్టు పునరుద్ధరిస్తాం. సిరాల గ్రామస్తులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.
– పవార్ రామారావుపటేల్, ముధోల్ ఎమ్మెల్యే


‘కడెం’కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



కడెం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. గురువారం ప్రాజెక్టుకు 10,536 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో, ప్రాజెక్టు అధికారులు రెండు వరద గేట్లను ఎత్తి 13,567 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 692.250(5.739 టీఎంసీ) అడుగులు ఉంది.

స్వర్ణ ప్రాజెక్టు ఒక గేటు ఎత్తివేత



మూడో గేటు నుంచి విడుదలవుతున్న నీరు

సారంగపూర్: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడో గేటును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,183 అడుగులు (1.484 టీఎంసీ)లు కాగా ప్రస్తుతం 1180.1 అడుగులు(1.183 టీఎంసీ)లకు చేరడంతో జేఈ మధుపాల్, దేవేందర్ ఒక గేటు ఎత్తి 1,810 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పరిస్థితిని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు.

గడ్డెన్నవాగుకు స్వల్ప ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. గురువారం ఉదయం వరకు వంద క్యూసెక్కుల నీరు వచ్చినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 356 మీటర్ల నీరు నిల్వ ఉంది.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి


పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్సై

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ సమీపంలో గల శ్రీ గణపతి ఆలయం వద్ద ఒకరు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై గణేశ్ సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతని జేబులో చిన్న కత్తి ఉన్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప పట్టివేత

కుభీర్: పార్డి(కె)లో గురువా రం కలప పట్టుకున్నట్లు డీఆర్‌వో ఇఫ్ఫానొద్దీ న్ తెలిపారు. కలప విలువ రూ.17,529 ఉంటుందన్నారు. కలప ఎవరు దాచారో ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ లెనిన్ ఉ న్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్: మండలంలోని గిమ్మలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం దాడులు నిర్వహించగా గిమ్మ గ్రామానికి చెందిన నరేందర్, రమేశ్, కిషన్, రామన్న, గొరన్న, పరమేశ్వర్ పేకాట ఆడుతూ దొరికినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.14,580 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిస్తే 8712659916 (సీఐ), 8712659929 (ఎస్సై) నంబర్లకు ఫోన్‌లో సమాచారం అందించాలని కోరారు.

బస్సు కోసం వినతి


ఆర్‌ఎంకు విన్నవిస్తున్న బెల్లాల్ గ్రామస్తులు

కడెం: జగిత్యాల–కడెం వయా రాయికల్, బోర్నపల్లి, చిన్నబెల్లాల్, పెద్దబెల్లాల్, కొండుకూర్ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామస్తులు కోరారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతునానరని తెలిపారు. గతంలో ఈ రూట్‌లో నడిచిన బస్సును పునరుద్ధరించాలని కరీంనగర్‌లో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరితకు గురువారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వెంకటరమణయాదవ్, రాములు, ఇల్యాస్, సృజన్, నరేశ్, వెంకటేశ్, సుగుణ ఉన్నారు.

కలిసిరాని కౌలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతుపేరు అశోక్ రెడ్డి. బేల మండలంలోని పాటన్‌కు చెందిన కౌలురైతు. కొన్నేళ్లుగా భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ. 20 వేల చొప్పున ఐదెకరాలకు రూ.లక్ష భూమి యజమానికి చెల్లించాడు. దున్నడం, విత్తనాలు, ఎరువులు, మందులు, కలుపుతీత, తదితర ఖర్చులకు ఎకరాకు రూ.25 వేలు అవుతుందని తెలిపాడు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోతే ఏడాదిపాటు చేసిన కష్టం వృథా కావడమే కాకుండా పెట్టుబడి, సాగు ఖర్చులు మీదపడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది కేవలం ఒక్క రైతు ఆవేదనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ కౌలు రైతు పరిస్థితి ఇదే.


భూమి చదును చేస్తున్న కౌలు రైతు(ఫైల్)

- ఏటా పెరుగుతున్న కౌలు ధరలు
- ప్రభుత్వం నుంచి అందని సాయం
- నష్టాలో ఊబిలో కూరుకుపోతున్న కౌలు రైతులు
- ఉమ్మడి జిల్లాలో 1,17,313 మంది..

ఇచ్చోడ: పంట రుణాలు, సబ్సిడీపై ఎరువులు, బ్యాంకులో రుణాలు, ప్రభుత్వం నుంచి అందని సాయంతో కౌలు రైతులు కష్టాల కడలిలో ఉన్నారు. పట్టాదారుల వద్ద భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న కౌలుదార్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చేయూత అందడంలేదు. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి వ్యవసాయాన్నే నమ్ముకున్న కౌలురైతులు ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాదైనా కాలం కలిసిరాకపోతుందా అని వ్యవసాయాన్నే నమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలుకోసం తెచ్చిన అప్పులు కట్టలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడి తనువు చాలిస్తున్నారు.

ఏటా పెరుగుతున్న కౌలు

కౌలు ధరలు ఏటా పెరిగిపోతున్నాయి. గతంలో ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఉండేది. కానీ ప్రస్తుతం కౌలుధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తీసుకుంటున్నారు. బోర్లు, బావులు ఉన్నభూములకు మరికొంత ఎక్కువే చెల్లించాల్సి ఉంటుంది.

కాలం కలిసొస్తే సరే...

కౌలు రైతులు లక్షల్లో ఖర్చు చేసి పంటలు సాగు చేస్తుంటారు. కానీ కాలం కలిసివస్తే సరే.. లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అప్పులు తీర్చలేక కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 19 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఏడుగురు కౌలురైతులే ఉన్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కౌలు రైతులు
ఆదిలాబాద్	28,763
ఆసిఫాబాద్	26,754
నిర్మల్	33,212
మంచిర్యాల	28,584

అందని ప్రభుత్వ సాయం...

కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడంలేదు. కౌలు రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో పెట్టకపోవడంతో వారికి కన్నీరే మిగులుతోంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ ఎన్నికల తర్వాత దాని ఊసే ఎత్తకపోవడంతో కౌలు రైతులు మరోసారి భంగపాటుకు గురికాక తప్పలేదు.

రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ఆత్మహత్య చేసుకున్న కౌలురైతులకు ప్రభుత్వం రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. త్రీసభ్య కమిటీ ద్వారా విచారణ జరిపించి కౌలురైతులను ఆదుకోవాలి. 194 జీవో ప్రకారం మరణించిన రైతుకు రూ.6 లక్షల నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్

నిజాయతీ చాటుకున్న డ్రైవర్, కండక్టర్


ప్రయాణికుడికి నగదు అందిస్తున్న అధికారులు

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో గురువారం క్యాష్‌బ్యా గ్ పోగొట్టుకున్న ప్రయాణికుడికి డ్రైవర్, కండక్టర్ బ్యాగును అందించి నిజాయతీ చాటుకున్నారు. నిజామాబాద్ నుంచి నిర్మల్ బయలుదేరిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు రూ.2 లక్షల నగదు గల బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయి నిర్మల్ బస్టాండులో దిగిపోయాడు. డ్రైవర్ తాజొద్దీన్, కండక్టర్ రాజు బ్యాగ్‌ను డిపోకు తీసుకువచ్చి అధికారుల సమక్షంలో తెరిచిచూడగా డబ్బుల కట్టలు ఉన్నాయి. ఆ బ్యాగ్ లో ఉన్న సమాచారం మేరకు అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఇంజనీర్ నవీన్ కుమార్, విజిలెన్స్ సెక్యూరిటీ ఎస్సై దయానంద్ ప్రయాణికుడు సురేష్‌ను డిపోకు పిలిపించి బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ..

ఆర్టీసీ బస్సులో రూ.25 వేల విలువ చేసే ఫోన్‌ను పోగొట్టుకున్న ప్రయాణికుడికి అఫ్రోజ్ అనే డ్రైవర్ గురువారం ఫోన్ అందించి నిజాయతీని చాటుకున్నాడు. ఈనెల 24న రాత్రి 10 గంటలకు జేబీఎస్‌లో నిర్మల్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఎక్కిన ప్రయాణికుడు మరుసటి రోజు ఉదయం మూడు గంటలకు నిర్మల్ బస్టాండ్‌లో సీట్‌పై ఫోన్ మర్చిపోయి దిగిపోయాడు. గమనించిన డ్రైవర్ ఫోన్‌ను చార్జ్ కంట్రోలర్‌కు అప్పజెప్పాడు. ఫోన్ కాల్ ద్వారా ఆ ప్రయాణికుడిని బస్టాండ్‌కు పిలిపించి అందజేశారు.

పెచ్చులూడిపడిన తిర్పెల్లి పాఠశాల పైకప్పు


వర్షానికి తడిసిన తరగతి గది

- తప్పిన ప్రమాదం

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి ప్రభుత్వ ప్రా థమిక పాఠశాలలో పెను ప్రమాదం తప్పింది. మూ డు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తిర్పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం తరగతి గదులు పూర్తిగా తడిసి పోయాయి. దీంతో విద్యార్థులను వరండాలోనే కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ఉదయం 11 గంటల సమయంలో మరో వరండాలో పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో అక్కడ విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఉన్న రెండు గదులు ఉరుస్తున్నాయి

పాఠశాలలో మొత్తం 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం రెండే తరగతి గదులు ఉన్నాయి. అవికాస్తా వర్షానికి ఉరుస్తున్నాయి.

ఆందోళనలో గ్రామస్తులు...


పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న గ్రామస్తులు

పాఠశాలలో పైకప్పు పెచ్చులూడి కింద పడిందని తెలిసిన గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు తమ పిల్లలను పంపడం భయంగా ఉందని రేపటి నుండి పంపమన్నారు. అధికారులు వచ్చి పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. సంఘటనపై ఎంఈవో మధుసూదన్‌ను వివరణ కోరగా మన ఊరు–మన బడి రెండవ దశలో భవనం కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు వస్తే ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

గొర్రెల కాపరి ఆచూకీ లభ్యం

- డయల్ 100 స్పందనతో రంగంలోకి పోలీసులు


పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులతో గొర్రెల కాపరి

దస్తురాబాద్: కవ్వాల్ అభయారణ్యంలో తప్పిపోయిన గొర్రెల కాపరి ఆచూకీ ఎట్టకేలకు గురువారం తెలిసింది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి గుండా శ్రీనివాస్ బుధవారం ఉదయం గొర్రెలను మేపేందుకు ఆకోండపేట సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై డయల్ 100కు ఫిర్యాదు చేశారు.

రంగంలోకి పోలీసులు..

డయల్ 100కు ఫోన్‌కాల్ రావటంతో స్పందించిన ఖానాపూర్ సీఐ సైదారావ్ పోలీసులను అప్రమత్తం చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి కానిస్టేబుళ్లు శ్రావణ్, సురేందర్, రవి, స్థానిక యువకులను వెంట బెట్టుకుని కవ్వాల్ అభయారణ్యంలోకి వెళ్లారు. అర్ధరాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం కడెం మండలంలోని కల్లెడ అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. గ్రామస్తుల సమాచారంతో రెండు బృందాలుగా విడిపోయి అడవిలో జల్లెడ పట్టారు. జన్నారం మండలంలోని నర్సింగపురం గ్రామ సమీపంలో గొర్రెల సమూహం కనిపించినట్లు సమాచారం అందడంతో పోలీసులు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా అడవిలోనే పెద్ద బండారాయిపై గొర్రెల కాపరి కనిపించాడు. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

డయల్ 100 స్పందనతో కవ్వాల్ అభయారణ్యంలో గొర్రెల కాపరిని కాపాడి, మిస్సింగ్ కేసును కొన్ని గంటల్లో ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100ను వినియోగించుకోవాలని సూచించారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అధికారులకు సూచించారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల మండల, జిల్లా స్థాయి అధికారులతో గురువారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ తోడ్పడుతుందన్నారు. నూతన ఆవిష్కరణలు చేసేలా గ్రామీణ యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రతీ మండలం నుంచి నూతన ఆవిష్కరణలను ఆగస్టు 3వ తేదీలోపు 9100678543 నంబరుకు ఆవిష్కర్త యొక్క పేరు, చిరునామా, ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు, ఫొటోలు, సంబంధిత వివరాలను వీడియో రూపంలో తీసి వాట్సప్ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఆగస్టు 15వ తేదీన ఆవిష్కరణల ప్రదర్శన, ఉత్తమ ఆవిష్కరణల ఎంపిక, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. జూమ్ మీటింగ్‌లో డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఈడీఎం నదీమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


జూమ్ మీటింగ్ లో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు జిల్లా కేంద్రంలోని పొద్దుటూరి కాంప్లెక్స్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు నిర్వహిస్తున్న శిక్షణను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి లక్ష్యాలు, ఉద్దేశాలను వడ్రంగి లబ్ధిదారులకు వివరించారు. ప్రతీ లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డీఎం నరసింహారెడ్డి, మెప్మా పీడీ సుభాష్, శిక్షణ నిర్వాహకుడు రాజు, అధికారులు పాల్గొన్నారు.


శిక్షణలో లబ్ధిదారులు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న 4 కిలోల 82 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎస్సై మనోహర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉట్నూర్‌కు చెందిన తవారే బాలాజీ, ఏపీకి చెందిన దుర్గ వంశీసాయి, బండారి గణేశ్ గంజాయిని తీసుకురాగా ఇంద్రవెల్లికి చెందిన శకావత్ గోవింద్ వారిని శ్యాంపూర్ వైపు తీసుకెళ్తున్నాడు. నలుగురు వ్యక్తులు ఒక తెలుపు రంగు సంచితో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. సమావేశంలో సీఐ మొగిలి, ఇంద్రవెల్లి, ఉట్నూర్ ఎస్సైలు పాల్గొన్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


లక్ష్మణ్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బొప్పరికుంట గ్రామానికి చెందిన టేకం లక్ష్మణ్ (28) గంగాపూర్‌వాగులో శనివారం గల్లంతైన విషయం తెలిసిందే..ఐదు రోజుల నుండి గాలింపు చర్యలు చేపట్టగా గురువారం వా గులో చెట్టు కొమ్మకు మృతదేహం తట్టుకొని ఉన్న ట్లు గుర్తించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై దిలీప్, వైద్య సిబ్బంది వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

యువతి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన అగ్గిమల్ల స్రవంతి (22) సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. గ్రామానికి చెందిన అగ్గిమల్ల గంగాధర్ కుమార్తె స్రవంతి మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆమె బాబాయ్ ఇంట్లో ఉంటోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం సూపర్ వాస్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డప్పు కొడుతూ వ్యక్తి మృతి

కాసిపేట: మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాడపాక బాపు (55) గురువారం దహన సంస్కారాల్లో డప్పు కొడుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముత్యంపల్లికి చెందిన వేల్పుల అంకులు అనే సింగరేణి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు వాయించేందుకు వెళ్లిన బాపు కొద్దిదూరం వెళ్లగానే తలనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే బైక్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. మృతునికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుండెపోటుతో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన పోరేత్ అశ్విని (23) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. అశ్విని కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుందని, మందులు వాడినా తగ్గలేదన్నారు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

లక్ష్మణచాంద: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గురువారం పార్‌పెల్లిలో దావ మల్లయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పీరాజీ కూలిన ఇంటిని పరిశీలించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య కోరుతున్నాడు.

దాడులు చేస్తున్న ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడులు చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. మామడ మండలం తాండ్రకు చెందిన రాథోడ్ గణేశ్ కూతురు, అల్లుడు పట్టణంలోని ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. గణేశ్ చికిత్స కొరకు రూ.45 వేలు జేబులో పెట్టుకొని నిర్మల్‌లోని పాత బస్టాండ్ వద్ద ఆగాడు. ఆ సమయంలో నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడుకు చెందిన బోసు రుక్మా, రాపాని రుక్మాక్క, బోసు శాంత, సాయన్న, పట్టణంలోని బుధవార్ పేట్‌కు చెందిన కర్రోళ్ల సాగర్, సాయవ్వలు గణేశ్‌ను కొట్టి ఆటోలో ఎక్కించుకొని పట్టణ శివారు ప్రాంతంలోని శ్యామ్‌ఘడ్ వద్దకు తీసుకెళ్లారు. అతని వద్ద ఉన్న రూ.45 వేల నగదు, సెల్ ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం పట్టణంలో తనిఖీ చేస్తుండగా ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బోడ కాకర కిలో రూ.500



మనకు ప్రకృతి ప్రసాదించిన కూరగాయల్లో బోడ కాకరకాయ ఒకటి. వీటినే అకాకర కాయ, అడవి కాకరకాయ అని కూడా పిలుస్తారు. చూసేందుకు మామూలు కాకర కాయల మాదిరిగానే ఉన్నా రుచిలో మాత్రం వ్యత్యాసం ఉంటుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో కిలో బోడకాకర రూ.500 పలుకుతోంది. ధర కాస్తా ఎక్కువగానే ఉన్నా ఆరోగ్య ప్రయోజనాలు ఉండడంతో చాలా మంది కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోగుల కష్టం.. మోయలేని భారం



నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాల్సిన రిమ్స్ ఆస్పత్రిలో కనీస వసతులు కరువయ్యాయి. పేషెంట్‌కేర్‌ల సంఖ్య తగినంతగా లేకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. తాజాగా ఓ రోగిని తోటి రోగి స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న దృశ్యం రిమ్స్‌లో దుస్థితికి అద్దం పడుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్